క్లుప్తంగా

బీజేపీకి స్వతంత్ర అభ్యర్థి మద్దతు

జడ్చర్ల టౌన్‌: డీకే అరుణకు మద్దతుగా స్వతంత్ర అభ్యర్థి, నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ గురువారం బీజేపీలో చేరారు. తాను బరిలో నుంచి తప్పుకుని బీజేపీ గెలుపుకోసం కృషిచేస్తానని ప్రకటించారు. తమ చిరకాల కోరిక అయిన రజకులను ఎస్సీలో చేర్చే అంశంపై డీకే అరుణకు వినతిపత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పార్టీ అధిష్టానంతో మాట్లాడటంతోపాటు భవిష్యత్‌లో ప్రభుత్వం మూడోమారు అధికారంలోకి వచ్చాక పార్లమెంట్‌లో ప్రస్తావించి రజకులను ఎస్సీజాబితాలోకి మార్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు



బాలానగర్‌: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో రంగారెడ్డిగూడలోని ఆయన నివాసంలో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు తిరుపతి, వెంకటేశ్వర్ రెడ్డి, కేఎస్ఆర్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: అల్లిపురంనకు చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం దమగ్నాపూరంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఉన్నారు.

ఎర్రగుంట చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కుర్విని శెట్టికాలనీ (28వ వార్డు) పరిధిలోని ఎర్రగుంట చెరువును గురువారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఈ చెరువును శుద్ధి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం సమీపంలో నివాసం ఉంటున్న ఇళ్ల వారికి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దీని వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శాంతన్నయాదవ్, అరుణ్‌కుమార్, బుద్దారం సుధాకర్‌రెడ్డి, జి.రఘు, పి.చిన్న, నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



సాక్షినెట్‌వర్క్‌: దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని సేవాదళ్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వాజిద్ మెహక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

■ బీజేపీని ఓడించాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సీడబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్ష, కార్యదర్శులు గోనెల రాములు, వరద గాలన్న అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులోని రూ.25 వేల కోట్లను వాడుకున్నారని ఆరోపించారు. మెట్టుగడ్డ, పాలకొండ, చిన్నదర్పల్లి, దొడ్డలోనిపల్లి, క్రిస్టియన్‌పల్లి, బండమీదిపల్లిలో సమావేశాలు నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోలేదని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పద్మ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలంటూ గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు.

■ దివిటిపల్లి గ్రామ డబుల్‌బెడ్ రూంల కాలనీలో సీపీఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి, సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్, కాంగ్రెస్ నాయకులు పాండురంగారెడ్డి, జి.శ్రీను, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

■ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం డీసీసీ ప్రధాన కార్యదర్శి, వార్డు ఇన్‌చార్జి సిరాజ్‌ఖాద్రీ ఆధ్వర్యంలో స్థానిక 34వ వార్డులోగల సింహగిరి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు రాజు, చందుయాదవ్, ఇబ్రాహీం ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

■ దేవరకద్ర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంజన్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ కోయిల్‌కొండలో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల అధ్యక్షుడు జి.రవీందర్, రాజారఘుపతిరెడ్డి, రాజునాయక్ పాల్గొన్నారు.

■ గండేడ్ పరిధిలోని గ్రామాల్లో పీసీసీ మెంబర్ నరసింహరావు, జిల్లా జనరల్ సెక్రటరీ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఆశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆశన్న, టీక్యానాయక్, చిన్నయ్య, రవీందర్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి సంసిద్ధం



తిరుమల హిల్స్‌లోని నర్సరీలో మొక్కలను నీరు పడుతున్న సిబ్బంది



పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని నర్సరీలో మొక్కలు నీరు పడుతున్న సిబ్బంది

- పట్టణంలోని 6 నర్సరీల్లో మొక్కల పెంపకం
- ఎప్పటికప్పుడు నీరు పడుతున్న కూలీలు
- 4.5 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- వర్షాలు ఆరంభం కాగానే గుంతల తవ్వకం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పదో హరితహారానికి స్థానిక మున్సిపల్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. దీని కోసం 2024–25 బడ్జెట్‌లో ఈ కార్యక్రమానికి రూ.93 లక్షలు కేటాయించారు. గతంలోనే ఆరు చోట్ల నర్సరీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బండమీదిపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో, ఎదిర శివారులోని తిరుమల హిల్స్‌లో, బైపాస్ సమీపంలో లక్ష చొప్పున, లక్ష్మీనగర్‌కాలనీలోని బృందావన్ కాలనీలో, కోయిలకొండ ఎక్స్ రోడ్డులో, పాలకొండలోని సాయిబాబా టెంపుల్‌కు ఎదురుగా ఉన్న నర్సరీలలో 50 వేల చొప్పున మొత్తం 4.5 లక్షల మొక్కలను నాలుగు నెలలుగా పెంచుతున్నారు. వీటిలో టేకోమ, గుల్‌మార్, గోవెన్‌విలియా, చింత, వేప, మామిడి తదితర రకాలు ఉన్నాయి. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి మూడు ఫీట్ల నుంచి ఆరు ఫీట్ల ఎత్తు వరకు చేరుకున్నాయి. మున్సిపల్ కాంట్రాక్టు సిబ్బంది హనుమంతు, శంకరయ్య (రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్లు) ఆధ్వర్యంలో అక్కడి కూలీలు ఎప్పటికప్పుడు నీరు పడుతూ సంరక్షిస్తున్నారు. అప్పుడప్పుడు మధ్యలో వచ్చే కలుపు మొక్కలను తొలగిస్తూ వస్తున్నారు. వీటిని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈయు.బస్వరాజ్ తరచూ పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగు సూచనలిస్తున్నారు. లక్ష మొక్కలు పెంచుతున్న చోట కనీసం ఐదుగురు కూలీలను, 50 వేల మొక్కలు పెంచుతున్న నర్సరీలలో ఇద్దరు లేదా ముగ్గురిని నియమించారు.

వర్షాలకు ఆరంభం కాగానే..

ఇక ఈసారి వర్షాలు ఆరంభం కాగానే పట్టణంలోని ముఖ్యమైన ప్రదేశాలు, కూడళ్లలో, రోడ్ల వెంట వీలునుబట్టి ఇరువైపులా గుంతలు తవ్వించనున్నారు. వచ్చే నెలలో నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నందున ఆ తర్వాతే పెంచుతున్న మొక్కలను వాహనాల ద్వారా తరలించి ఎక్కడికక్కడ నాటుతారు. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి గతంలోనే కాంట్రాక్టర్లకు అప్పగించారు. అనంతరం ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేస్తారు. అలాగే తమ ఇంటి వద్ద ఎవరైనా మొక్కలు నాటాలనుకునే వారికి ఉచితంగా అందజేస్తారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..



పట్టణంలో పదో హరితహారానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈపాటికే ఆయా నర్సరీలలో మొత్తం 4.5 లక్షల మొక్కలను పెంచుతున్నాం. వర్షాకాలం సీజన్ ఆరంభం కాగానే వివిధ ప్రాంతాల్లో గుంతలు తవ్వించి నాటుతాం. అలాగే ఎవరైనా ఇంటి వద్ద పెంచుకుంటామంటే ఉచితంగా పంపిణీ చేస్తాం.

– డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

పాలమూరు భవిష్యత్ కోసం ఓటేయండి



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం

స్టేషన్ మహబూబ్‌నగర్: మన పాలమూరు భవిష్యత్తు కోసం కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయండని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన జాంద్ర ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలు పాలమూరు భవితవ్యాన్ని నిర్ణయిస్తాయన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మహేందర్, కృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే యెన్నం జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక 28వ వార్డులో ఇంటింటి ప్రచారంలో ఓటర్లను కలిసి వంశీచంద్‌రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు శాంతన్న, సుధాకర్‌రెడ్డి, చిన్న, రఘు, అరుణ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్దతు లభించాలని గుడిగంట



రామాలయంలో గంట కొడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ కోరారు. గురువారం ఉదయం టీచర్స్‌కాలనీలోని రామాలయం లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుడిగంట కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కౌన్సిలర్ పుల్లా నీరజ, కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, రామకృష్ణ, కిషన్‌నాయక్, రవిప్రకాష్, అంజద్, అవేజ్, వజీద్, ముక్తార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీడీగుట్టలో గురువారం జరిగిన కార్నర్‌మీటింగ్‌లో వంశీచంద్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. మన ప్రాంత బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి ఈ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. పాలమూరు జిల్లాను ప్రగతి పథంలో నడిపించే దిశగా ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆలోచనతో ఓటు వేసి పాలమూరు అభివృద్ధికి కలిసిరావాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు ఒబేదుల్లా కొత్వాల్, శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, ఎన్‌పీ.వెంకటేశ్, సాయిబాబా, సిరాజ్‌ఖాద్రీ, రాధా అమర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతున్నదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణ ఇంటా, బయట మహిళలపై దాడులు జరిగితే ఏ నాడు నోరుమెదపలేదన్నారు. మణిపూర్‌లో రాష్ట్రంలో మహిళల పట్ల అమానవీయ ఘటన జరిగినప్పుడూ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఈపదేళ్ల కాలంలో దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమిలేదన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధా అమర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బ్రేకులు ఫెయిల్: జీపు బోల్తా

నవాబుపేట: జిల్లా కేంద్రం నుంచి నవాబుపేటకు ప్రయాణికులతో వస్తున్న ప్రైవేట్ జీపు గురువారం మైసమ్మ అడవిలో మలుపుల చెంత అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో జీపులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. కాగా అటుగా వెళ్తున్నవారు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. దీంతో బాధితులను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా జీపు బ్రేకులు ఫెయిల్ కావటంతో మలుపుల చెంత కరెంటు సంభాన్ని ఢీకొట్టిందని.. అడవిలోపలి వైపు బోల్తా పడిందని తెలిసింది. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకుందాం



దేవరకద్ర: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జోరుగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు వాడల్లో నాయకులు బృందాలుగా ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకుందామని కోరారు. బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, కురుమవాడ ఇంకా పలు వాడల్లో ప్రచారం జోరుగా సాగింది. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు వెంకటేశ్, బాల్‌రాజు, భాస్కర్‌రెడ్డి, నరేష్, అంజనేయులు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

అందుకే సాగనంపారు

మహమ్మదాబాద్: బీఆర్ఎస్ పాలనతో విసుగెత్తినందుకే ప్రజలు వారిని సాగనంపారని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం నంచర్లగేట్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. రంజిత్‌రెడ్డికి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, అనిత దంపతులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

వేడుకలకు సర్వం సిద్ధం



వేడుకలకు సిద్ధం చేస్తున్న బసవేశ్వర ఆలయం

నారాయణపేట రూరల్: బసవజయంతి, అక్షయ తృతీయ వేడుకలకు పట్టణం సిద్ధమైంది. స్థానిక సరాఫ్‌బజార్‌లో దేవాదాయశాఖ పరిధిలోని శ్రీ బసవేశ్వర ఆలయానికి సున్నం వేయించి, విద్యుత్ దీప అలంకరణలతో అందంగా ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం 7:గంటలకు స్వామివారికి మహా రుద్రాభిషేకం, బిల్వార్చన, మహామంగళహారతి, అలంకరణ, అష్టోత్తర నామావళి, అలంకారపంక్తి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 9:30 గంటలకు పతాకావిష్కరణ, 11గంటలకు డోలారోహణం, సాయంత్రం 5:30గంటలకు కాడెద్దుల ఊరేగింపు ఉంటుంది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ దర్మకర్త బుస్సయ్యస్వామి అన్నారు.

■ పట్టణంలోని శ్రీ శివలింగేశ్వర ఆలయంలో వీరశైవ లింగాయత్ – లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9:గంటలకు బసవేశ్వర చిత్రపటానికి పూజలు, ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన, పుష్పాలంకరణ, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అవుటి రవికుమార్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

■ అదేవిధంగా అక్షయ తృతీయను పురస్కరించుకుని సరాఫ్‌బజార్‌లో బంగారు, వెండి వర్తకులు సైతం వివిధ డిజైన్లతో ఆభరణాలు సిద్ధం చేశారు. పెద్దఎత్తున బంగారం, వెండి కొనుగోళ్లు జరగనున్నాయి.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



మాగనూర్: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో నీడ, నీరు, వైద్య సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీఓ రాజేశ్వరి సూచించారు. గురువారం ఆమె మండలంలో వడ్వాట్ గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. అక్కడ జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ.. రోజుకి రూ. 300 కూలీ పడే విధంగా పనిచేయాలని కచ్చితంగా పూర్తిచేసుకుని, వంద రోజులకు రూ.30 వేలు తీసుకోవాలని అన్నారు. కూలీలు కొలతల వారీగా పనిచేయాలని తెలియజేశారు. అనంతరం నర్సరీ, బృహపలెల ప్రకృతి వనాలను పరిశీలించారు. నర్సరీలోని మొక్కలను హరితహారం ప్రారంభ దశ వరకు మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అక్కడ నుంచి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఉమ్మడి కృష్ణ, మాగనూర్ మండలాలకు సంబంధించిన ప్రగతిపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జైపాల్ రెడ్డి, ఇంచార్జీ ఏపీవో హర్షవర్ధన్, ఉమ్మడి మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్సే..



ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

నవాబుపేట: ప్రశ్నించే గొంతుక కేవలం బీఆర్ఎస్‌కే ఉందని పార్లమెంట్‌లో... తెలంగాణకు న్యాయం జరగాలంటే పాలమూర్‌లో మరోసారి గెలవాల్సిన అవసరం ఉందని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లి తదితర గ్రామాలకు చెందిన వారు పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే తెలంగాణాలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఎన్నికల హామీలు విస్మరించిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ సైతం పదేళ్లుగా అధికారంలో ఉండి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. నాయకులు కృష్ణమోహన్, శివరాజ్, రవి, లక్ష్మయ్య, శ్రీనివాస్, పురుషోత్తం, తిర్పతయ్య తదితరులు ఉన్నారు.

ఎన్నికలయ్యాక బీజేపీ, బీఆర్ఎస్ కనిపించవు



తిమ్మాపూర్‌లో ఈవీఎం నమూనాను చూపుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల/దేవరకద్ర: పార్లమెంట్ ఎన్నికలయ్యాక గ్రామాల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కనిపించవని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మూసాపేట మండలం స్ఫూర్తితండా, చక్రాపూర్, కనకాపూర్, తిమ్మాపూర్, అచ్చాయపల్లి, జానంపేట, నిజాలాపూర్, మూసాపేట, సంకలమద్ది, తుంకినీపూర్, వేముల గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పని చేసినందుకు ప్రజలు వారిని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారని గుర్తు చేశారు. పదేళ్లలో దేశంలో అభివృద్ధి పనులు చేయని బీజేపీ దేవుని పేరు చెప్పి ఓట్లడిగే స్థాయికి దిగజారిందని విమర్శించారు. ఎంపీగా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, రామన్‌గౌడ్, బాలనర్సిములు, బగ్గి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలం డోకూర్, గోపన్‌పల్లిలో ప్రచారంలో మాట్లాడారు. ఆయా గ్రామాల నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద మున్సిపల్ కమిషనర్ రాజయ్య



చిన్నరేవళ్లిలో..

జడ్చర్ల టౌన్‌: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మున్సిపాలిటి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను కమిషనర్ రాజయ్య, ఏఈ భాస్కర్, శానిటేషన్ ఇన్‌చార్జి నాగేష్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, శానిటేషన్ల ఏర్పాట్ల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల ముందురోజున పోలింగ్ అధికారులు, సిబ్బంది చేరుకోనున్నారని, వారికి తగిన వసతులు కల్పించాలన్నారు. అలాగే ఎన్నిక రోజున వచ్చే ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

బాలానగర్‌: మండల పరిధిలోని చిన్నరేవళ్లిలో ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాన్ని ఎలక్షన్ సెక్టర్ అధికారి అనిల్‌సాగర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



డీకే అరుణ సమక్షంలో పార్టీలోచేరిన బీఆర్ఎస్ నేతలు



కాకర్లపహాడ్‌లో..

నవాబుపేట: మండల పరిధిలోని కాకర్లపహాడ్, దేపల్లి, చౌడూర్, లోకిరేవు, నవాబుపేట గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నరేందర్, శ్రీనివాస్, వెంకటేష్, నర్సింహులు, అంజయ్య, బీజేవైయం మండల అధ్యక్షుడు అంజనేయులు, జిల్లా నాయకులు లక్ష్మయ్య, శేఖర్, రాజు, ప్రశాంత్, చారి, శ్రీధర్, ఆరుణ్ ఉన్నారు.

బీసీ నేతల మద్దతు..

పాలమూరు: పార్లమెంట్ పరిధిలో ఉన్న బీసీలు అందరూ ఐక్యం అయి డీకే అరుణను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని.. తెలంగాణలో ఉన్న 17స్థానాల్లో ఇద్దరూ మహిళలకు, ఐదుగురు బీసీలకు టికెట్ ఇచ్చారని బీసీ నేత మెట్టుకాడి శ్రీనివాసులు తదితరులు పిలుపునిచ్చారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తిగా మహిళ వ్యతిరేకులుగా మారిపోయారని తెలిపారు. రాబోయో ఎన్నికల్లో మోడీకి మద్దతుగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

పాలమూరు: బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో గురువారం హన్వాడ మండలం మాజీ ఎంపీపీ వడ్ల శేఖర్, మాజీ సర్పంచ్ కొండ బాలయ్య, పెద్దర్పల్లి కృష్ణయ్యగౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయో ఎంపీ తెలంగాణలో అధిక సీట్లు గెలుస్తున్నామని, పాలమూరులో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. బీజేపీ పార్టీ బలోపేతం కావడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతలు పద్మజారెడ్డి,రమేష్, సత్యం, అంజయ్య పాల్గొన్నారు.

దేవరకద్ర: గోప్లాపూర్‌లో బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి ఇంకా పలువురు నాయకులు దేవరకద్రలో ఇంటింటికి తిరిగి బ్యాలెట్ నమూనాలను పంపిణీ చేశారు. డమ్మీ ఈవీఎమ్‌ను చూపించి ఓటేయాలని సూచించారు.

కాంగ్రెస్ వచ్చింది.. కరువు మొదలైంది



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రాజాపూర్: కాంగ్రెస్ రావడంతోనే కరువు మొదలైందని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పేద ప్రజలకోసం గతంలో ఉన్న రూ. రెండు వందల పింఛన్ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. రెండువేలు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. నాలుగు వేలు చేస్తామని.. కనీసం ప్రస్తుతం ఉన్నది కూడా ఇవ్వడం లేదన్నారు. ఇక బీజేపీ జై శ్రీరామ్ అంటూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. రాజకీయ నాయకుడు హుందాగా ఉండాలని.. సోషల్ మీడియాలో తొండిమాటలు మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ మాట్లాడినా కబ్జాలు చేస్తున్నారని అంటున్నారని.. అధికారంలో వారి ప్రభుత్వమే ఉందని..కబ్జాలకు పాల్పడితే ఏ పార్టీవారైనా బయటకు తీయాలన్నారు. అందుకు పూర్తిగా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కప్పెరిబచ్చిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, అభిమన్యూరెడ్డి, నర్సింలు, శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.